ప్రజాశక్తి

బుధవారం 13 మార్చి 2024



ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం కోట/టౌన్

విజయనగరంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఎస్‌పి అస్మా ఫర్హీన్ మంగళవారం పరిశీలించారు. ఆర్‌కె కాలేజ్, గాయత్రి, శ్రీ చైతన్య, సాయి గాయత్రి, శ్రీనివాస, నారాయణ కాలేజ్ పరీక్ష కేంద్రాలను సందర్శించి, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులకు పలు భద్రతాపరమైన సూచనలు చేశారు.

1517 మంది గైర్హాజరు

జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ పరీక్షకు 1517 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 23652 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 22135 మంది హాజరయ్యారు. మిగిలిన 1517 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష జరిగిందని ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ తెలిపారు.

టిడిపిలో కమలం చిచ్చు



- విజయనగరం, అరకు పార్లమెంట్ స్థానాలను బిజెపికి వదిలేసిన అధిష్టానం
- అగ్గిమీద గుగ్గిలమౌతున్న తెలుగు తమ్ముళ్లు
- నెల్లిమర్లలో ఉనికి కోల్పోనున్న తెలుగుదేశం
- పునరాలోచించకపోతే నష్టపోతామంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాల టిడిపిలో కమలం చిచ్చురేపింది. పొత్తులో భాగంగా టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలు నిర్విరామంగా వ్యతిరేకత ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఇది చల్లారకముందే బిజెపితో పొత్తు కుదుర్చుకోవడం, విజయనగరం, అరకు పార్లమెంట్ స్థానాలు బిజెపికి కేటాయిస్తున్నట్టు వెల్లడించడంతో ఈ రెండు జిల్లాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

విజయనగరం, పార్వతీపురం జిల్లాలో ఒకప్పుడు టిడిపికి కంచుకోట వంటివి. గత ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలవకపోయినా ఓట్లు రీత్యా టిడిపి తక్కువేం కాదు. వైసిపి నాయకుల నుంచి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని తెలుగు తమ్ముళ్లు పార్టీలో నిలబడ్డారు. 2024లోనైనా తమ పార్టీ అధికారంలోకి రాకపోతుందా? తాము బలపరుస్తున్న నేతలు ఎంపీ కాకపోతారా? అని ఎదురు చూశారు. కానీ, ఆ ఆశలు అడియాశలే అయ్యాయి. బిజెపితో పొత్తు పేరిట విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల టిడిపి కేడర్ బిజెపి అభ్యర్థికి ఓటు వేయాల్సి రావడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. నెల్లిమర్లలో అయితే, సైకిల్ గుర్తుకు ఓటేసే అవకాశమే లేని దుస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో జిల్లా నాయకులు మొదలుకుని, సామాన్యకార్యకర్తల వరకు తీవ్ర ఆవేదనతో అధిష్టాన వైఖరిని తప్పు పడుతున్నారు. బిజెపితో జతకడితే మొదటికే మోసం జరుగుతుందంటూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం లోలోపల మదనపడుతున్నారు. సాలూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మరో అడుగు ముందుకు వేసి 'అరకు పార్లమెంట్ బిజెపికి ఇవ్వకుండా మీరంతా సిఫార్సు చేయండి' అంటూ ఏకంగా సోషల్ మీడియా ద్వారా పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం గమనార్హం. ఇంతలా మదన పడుతున్న టిడిపి శ్రేణులు, నాయకులు బిజెపికి ఎలా పనిచేస్తారన్నది విశ్లేషకుల ప్రశ్న. పార్లమెంట్ అభ్యర్థి వ్యక్తిగత చరిష్మా దాని పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులకు ఎంతో కొంత ఉపయోగపడవచ్చన్నది సర్వ సాధారణం. కానీ, అదే ఎంపీ అభ్యర్థి బిజెపి తరపున పోటీచేయడంతో మొత్తం అసెంబ్లీ స్థానాల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారం వెలగబెట్టిన బిజెపి విభజన చట్టంలోని హామీలను అమలు చేయలేదు. ముఖ్యంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల హామీ కూడా అమలు చేయలేదు. చివరకు విభజన హామీల్లో భాగంగా జిల్లాకు మంజూరు చేసిన గిరిజన వర్సిటీకి కూడా తగిన నిధులు కేటాయించలేదు. దీంతో, ఆ వర్సిటీ ప్రస్తుతం అసౌకర్యాలు, సమస్యల నడుమ పరాయి పంచన నడుస్తోంది. ఈ నేపథ్యంలో బిజెపి అభ్యర్థులపైనా ప్రజలు సహకరించే పరిస్థితి లేదని, ఆ ప్రభావం టిడిపి తరపున పోటీచేసే అభ్యర్థులపైనా పడుతుందని చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఇంతనష్టం మనకే అవసరమా? అంటూ టిడిపిలో చర్చనడుస్తోంది. సొంతపార్టీకి ఒక్క ఓటు కూడా వేసుకునే అవకాశం లేకపోవడంతో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిష్టానంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల టిడిపి కేడర్‌లో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

బిజెపి కలయికతో

టిడిపికి చీకటి రోజులు

విజయనగరం ఎంపి టికెట్ కేటాయిస్తే మూకుమ్మడి రాజీనామాలు : టిడిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-డెంకాడ

బిజెపితో జత కట్టడంతో జిల్లాలో టిడిపికి చీకటి రోజులు వచ్చినట్టేనని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం ఎంపి టిక్కెట్‌ను బిజెపికి కేటాయించిన నేపథ్యంలో తామంతా రాజీనామా చేస్తామని ప్రకటించారు. వెంటనే అధిష్టానం పునరాలోచించి టిడిపికి కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ విజయనగరం పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ పానిరాజు, పార్టీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు మాట్లాడారు. నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపికి కంచుకోట లాంటిదని, అలాంటిది జిల్లాలో టిడిపి ఉనికి లేకుండా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరిగా గెలుస్తామనుకున్న సీటును జనసేనకు కేటాయించడంతో పార్టీ ఆదేశాలు ప్రకారం నడుచుకుందా మని అనుకున్నామని, ఇంతలో బిజెపికి పార్లమెంట్ సీటు కేటాయించడం సరైనది కాదని అన్నారు. గతంలో పార్లమెంట్ పరిధిలో బిజెపికి 7వేల ఓట్లు మాత్రమే వచ్చాయని, ఇక్కడ కార్యకర్తలు, నాయకులు లేక పక్క జిల్లాల నుంచి దిగుమతి చేసి పోటీ చేయించడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఎంపి టిడిపికి కేటాయిస్తే అందరం కలిసి పనిచేస్తామని తెలిపారు. 2019 ఎన్నికల తరువాత టిడిపి జెండాను మోసి, పార్టీని నిలబెట్టామని, నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాలు తీసుకోకుండా ఎమ్మెల్యే ఎంపీ టికెట్లను జనసేనకు, బిజెపికి కేటాయించారని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ లేకుండా చేశారని ఆవేదన చెందారు. పార్టీ బతకాలంటే నియోజకవర్గానికి చెందిన వ్యక్తిగాని, జిల్లాలో ఉన్న వ్యక్తికి గాని టిడిపి ఎంపీ టికెట్ ఇస్తే పార్టీ బతుకుతుందని తెలిపారు లేదంటే పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ, నాయకులు చీకటి సుహాసిని, బంటుపల్లి మురళీధర్ రావు, పడాల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు కంది చంద్రశేఖర్

కోలగట్ల నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా

టిడిపి అభ్యర్థికే మా మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా విజయనగరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు విజయానికి తామంతా కృషి చేస్తామని వైసిపి నాయకులు, అర్బన్ బ్యాంకు మాజీ అధ్యక్షులు కాళ్ల గౌరీ శంకర్ ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విజయనగరంలో తొలిసారిగా వైసిపి జెండా పట్టుకున్న ఆవనాపు కుటుంబాన్ని పార్టీ నుంచి బయటకు పంపించే విధంగా కోలగట్ల పొగ పెట్టారని, ప్రశాంతంగా ఉండే ప్రాంతాల్లో కత్తులతో దాడి వంటి విష సంస్కృతిని కోలగట్ల ప్రోత్సహించారని అన్నారు. తనకు నచ్చని వారిని తప్పుడు కేసుల్లో ఇరికించే దుర్బుద్ధితో వ్యవహరించారని గౌరీ శంకర్ ఆరోపించారు. కార్పొరేషన్ కార్యాలయాన్ని, మండల కార్యాలయాన్ని కబ్జా చేసిన ఘనుడు ఎమ్మెల్యే అని ఘాటు విమర్శలు చేసారు. కుళాయి కనెక్షన్ కావాలన్నా, మ్యూటేషన్ జరగాలన్నా ఎమ్మెల్యే ప్రమేయం తప్పని సరైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వైయస్ రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి అభిమానులమైనప్పటికీ ఎమ్మెల్యే నియంతృత్వ పోకడలను నిరసిస్తూ రానున్న ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గంలో అదితి విజయలక్ష్మి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో కాళ్ల గౌరి శంకర్ అనుచరులు కనకల సత్యనారాయణ, హంస శ్రీనివాసరావు, ఎడ్ల కాంతారావు, గలావిల్లి గోపి, తాలాడగిరి, కరుబుక్త సురేష్, తాలాడ సురేష్, కాళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు కాళ్ల గౌరీశంకర్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాఠశాలల వర్కర్లు

జీతాలు పెంచాలని ఆయాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శానిటేషన్ వర్కర్ల జీతం రూ.6వేలు నుంచి రూ.12వేలుకు పెంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆయాలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బేగం, నందిని మాట్లాడుతూ పార్ట్ టైం వర్కర్ అని చెప్పి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫుల్ టైం వర్కర్లుగా పనిచేస్తున్నారని అన్నారు. తరగతి గదులను , బాత్రూములను శుభ్రం చేయడంతో పాటు పిల్లలను కంట్రోల్ చేయటం, టీ మంచినీళ్లు, రికార్డులను అందించడం, జిరాక్సులు తీయించడం తదితర పనులు చేస్తున్నారని తెలిపారు. వారందరినీ ఫుల్ టైం వర్కర్లుగా గుర్తించి జీతం రూ.12వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు కార్తీక్‌కు వినతినిచ్చారు. కరోనా కు ముందు నుంచి 2020 వరకు ఒక్కొక్క ఆయాకు కనీసం 6 నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు నెలకు రూ. 2వేలు చొప్పున జీతం బకాయి ఉందని, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుల నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి వరకు పలుమార్లు విన్నవించిన నేటికీ వర్కర్లకు డబ్బులు పడలేదని, సమగ్ర విచారణ చేసి జీతాలు చెల్లించాలని జెసిని కోరారు. సిక్ లీవ్‌లు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ధర్నాకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు జి.కుమారి మద్దతు ప్రకటించారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి

ప్రజాశక్తి-భోగాపురం, నెలిమర్ల

ఓటర్లు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. సున్నిత ప్రాంతాలుగా గుర్తింపు పొందిన భోగాపురం మండలం ముంజేరు, నెల్లిమర్ల మండలం మల్యాడ గ్రామాల్లో ఓటర్లకు మంగళవారం అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక పాల్గొని అవగాహన కల్పించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంలో భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. ప్రతీ పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని, పోలీసు శాఖ నుంచి కూడా మరో సెక్టార్ అధికారిని నియమించామని తెలిపారు. ఓటు వేయడంలో తమకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఈ గ్రూపు సభ్యులకు, సెక్టార్ అధికారులకు లేదా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, వికలాంగులు తమ ఇంటివద్దనే ఓటుహక్కును వినియోగించే అవకాశాన్ని తొలిసారి ఈ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. ముందుగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని కలెక్టర్ చెప్పారు.

ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. గత ఎన్నికలో జరిగిన వివాదాలను దష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలను చేపట్టామన్నారు. దీనిలో భాగంగా కొందరిని బైండోవర్ కూడా చేశామన్నారు. కార్యక్రమాల్లో ట్రైనీ ఐపిఎస్ అధికారి మండ జావలి ఆల్ఫాన్స్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐలు ఎ.రవికుమార్, వెంకటేశ్వరావు, రెండు మండలాల తాహశీల్దార్లు శ్యామ్ ప్రసాద్, ధర్మరాజు, ఎంపిడిఒలు జి.చంద్రకళ, రామారావు, ఎన్నికల డిటిలు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

కాలువ సమస్యను పంచాయతీ సమక్షంలో పరిష్కరించుకోండి

కాలువ సమస్యను పంచాయతీ పరిధిలోని సామరస్యంగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మంజేరు గ్రామస్తులకు సూచించారు. కొన్ని రోజుల నుంచి ముంజేరు గ్రామంలో సిద్ధార్థ కాలనీవాసులకు, గ్రామస్తులకు మధ్య కాలువ వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా సర్పంచ్ నూకరాజు, మాజీ ఎంపీటీసీ పిడుగు రాంబాబు, పిడుగు గోపి తదితరులు మాట్లాడుతూ సిద్ధార్థ కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా కాలువ నిర్మాణం చేపట్టాలని వీరంతా కోరారు కలెక్టర్ జోక్యం చేసుకొని అధికారులతో ఒక కమిటీ వేయనున్నామని తెలిపారు. వారి సూచనల మేరకు పంచాయతీ సమక్షంలో మీరంతా కలిసి ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించారు.



భోగాపురం : ముంజేరు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

రెండు రోజుల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు పూర్తి కావాలి

విజయనగరం : ఎన్నికలకు సంబంధించి పాత ట్రెజరీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో అన్ని రకాల ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు ఆదేశించారు. గురువారం జెసి కార్తీక్, డిఆర్ఒ అనితతో కలసి కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తల మానిటరింగ్ , తదితర సేవలకు సంబంధించి పలు శాఖల నుండి అధికారులను, సిబ్బందిని నియమించారు. పోల్ డే రోజున వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు అవసరమైన సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఓటు విలువను తెలిపే పలు స్లోగన్ల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, సిపిఒ బాలాజీ, జెడ్‌పిసిఇఒ రాజ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస రావు, డిపిఆర్ఒ రమేష్, కలెక్టరేట్ ఎఒ ప్రభాకర్, ఎన్నికల విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం సహకారంతో రైల్వే సౌకర్యాల కల్పన

ఎంపి బెల్లాన చంద్రశేఖర్

విశాఖ - భువనేశ్వర్ వందేభారత్ రైలుకు స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విశాఖ - భువనేశ్వర్ మధ్య కొత్తగా ఏర్పాటు చేసిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఘనస్వాగతం లభించింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోది ఈ రైలును వర్చ్యువల్‌గా ప్రారంభించగా విశాఖ నుంచి విజయనగరం స్టేషన్‌కు ఈ రైలు ఉదయం 10.37 గంటలకు చేరుకుంది. విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పి.సురేష్‌బాబు, పి.రఘువర్మ, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో వన్ స్టేషన్ - వన్ ప్రొడక్ట్ కార్యక్రమాన్ని కూడా ఎం.పి. ప్రారంభించారు. ఎంపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరం జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో పెద్ద ఎత్తున రైల్వే వసతులు కల్పించామని చెప్పారు. కేంద్ర రైల్వే మంత్రి, రైల్వే అధికారులను కలసి విన్నవించిన ఫలితంగా చీపురుపల్లిలో రైల్వే పైవంతెన రూ.13 కోట్లతో నిర్మాణం పూర్తికావచ్చిందని, రూ.3 కోట్లతో పాదచారుల వంతెన కూడా మంజూరయ్యిందన్నారు. తన నియోజకవర్గపరిధిలో 9 అండర్‌పాస్‌లు కూడా మంజూరయ్యాయన్నారు. విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు కూడా చేపట్టామన్నారు. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటు కోసం కేంద్రం సుముఖంగా వుందని, అనువైన స్థలం కేటాయిస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని రైల్వే మంత్రి చెప్పారని పేర్కొన్నారు.



వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ఎంపి, ఎమ్మెల్సీలు



వాకర్స్‌తో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి

టిడిపితోనే మహిళలకు గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి ని స్థాపించిన తరువాతే రాష్ట్రంలో మహిళలకు గుర్తింపు వచ్చిందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి అన్నారు. టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి సూచన మేరకు తెలుగు మహిళా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం 5వ, 6వ 7వ డివిజన్‌లకు సంబంధించి దాసన్నపేటలో ప్రసాదుల కనకమహాలక్ష్మి ఇంటి వద్ద 'డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి హయాంలోనే మహిళలకు ఆస్తిలో సమానహక్కు, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా టిడిపి, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన 'కలలకు రెక్కలు' అనే పథకం గురించి వివరించారు.కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకులు సువ్వారి అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, కంది శమంతకమణి, చింతల వీరలక్ష్మి, రౌతుపద్మ, పద్మలత, సియ్యాదుల ఝాన్సీ, వెలిచేటి మణికుమారి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ దారులకు అండగా ఉంటాం

అలకానంద కాలనీ తోష్నివాల్ వాకర్స్ క్లబ్ సభ్యులతో టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి సమావేశమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందన్నారు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లలకు జీతాలు సరిగ్గా అందటం లేదన్నారు, ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అదితి విజయలక్ష్మిని గెలిపించాలని కోరుతూ ఎస్‌సి సెల్ నాయకులు 12వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు గొండేల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి శంకర్రావు దేవరపల్లి తదితరులు పాల్గొన్నారు.


మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం చిరస్మరణీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం రింగ్ రోడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన నాలుగో విడత చేయూత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 11,094 మంది మహిళలకు 20కోట్ల 80లక్షల12,500 రూపాయలు, మండల పరిధిలో ఉన్న 3,296 మంది మహిళలకు రూ.6.18 కోట్ల రూపాయల మెగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఒకటో తేదీ కల్లా పింఛన్లను ఇంటి వద్దకే తెచ్చి అందిస్తున్న ఘనత తమదేనన్నారు. అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించామన్నారు. మరోసారి తమకు అవకాశం ఇస్తే పూర్తిస్థాయిలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామని తెలిపారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు అండగా జగనన్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాస్ రావు, పిఎసిఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాధరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ,పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత వైసిపిదే

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జొన్నవలస, మలిచర్ల, సుంకరి పేట ప్రాంత లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను అందించారని అన్నారు. ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించి నట్లయితే మిగిలి ఉన్న అందరికీ ఇళ్ల పట్టాలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నట్టేట ముంచారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, జడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాధరావు, ఎంపిడిఒ గంటా వెంకట్రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

బాబు జగ్జీవన్ రాం ఆశయాలు భావితరానికి స్ఫూర్తిదాయకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి జంక్షన్లో బాబు జగజ్జీవన్ రావు విగ్రహ ఏర్పాటుకై శంకుస్థాపన చేశారు. ముందుగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ దేశానికి ఉత్కృష్టమైన సేవలను అందించిన మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన గురుతరబాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె వెంకట్ సుబ్బయ్య ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రేణురజనీ, ఇసిఇ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ జి.పద్మావతి మాట్లాడుతూ మహిళలు లేని రంగం లేదన్నారు. మనముందున్న సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కొని నిలబడినప్పుడు దేనినైనా సాధించగలమన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళా ఉద్యోగులకు, విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు' భారతరత్న అవార్డు ప్రకటించాలని ప్రముఖ న్యాయవాది, సంఘ సేవకుడు బొడ్డు సత్యనారాయణ అన్నారు. మంగళవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అమరజీవి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో న్యాయవాది బొడ్డు సత్యనారాయణకు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ వద్ద 56 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం కార్యదర్శి సముద్రాల నాగరాజు,కోశాధికారి డిమ్స్ రాజు, దాలయ్య శెట్టి, వెత్సా సత్యనారాయణ, మండవిల్లి వెంకటరాజు, ఆకి సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విజ్జి మైదానంలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జి స్టేడియంలో సమస్యలు పరిష్కరించాలని వైసిపి పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ముద్దాడ మధు డిమాండ్ చేశారు.మంగళవారం విజ్జి స్టేడియంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల నిర్లక్ష్యం వలన విజ్జి స్టేడియం సమస్యలతో సతమవుతుందన్నారు. స్టేడియంకు వెళ్లే రహదారి పూ ర్తిగా పాడైపోయిందని, ఏళ్ల తరబడినా బాగు చేయలేదని తెలిపారు. రూ.10కోట్లతో నిర్మించిన స్టేడియంను నేటికీ ప్రారంభించ లేదన్నారు. వాకింగ్ ట్రాక్ సుమారు రెండున్నర కిలోమీటర్లు పూర్తిగా గతుకులమయమైందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసి పై సమస్యలపై వినతినిస్తామని, వెంటనే చర్యలు తీసుకోపోతే వాకర్స్‌తో కలిసి నిరసన తెలుపుతామని తెలిపారు.

లెండిలో 'రవికుల రఘురామ' సినిమా టీమ్

డెంకాడ: ఈ నెల 15న విడుదల కాబోతున్న రవికుల రఘురామ సినిమాను ప్రోత్సహించాలని కోరుతూ జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులను సినిమా హీరో గౌతమ్ సాయి, సహాయ నటుడు బిగ్ బాస్ ఫేమ్ మచ్చా మహేష్, దర్శకుడు చంద్ర శేఖర్ కోరారు. సినిమాకు సంబంధించిన కొన్ని అంశాలను విద్యార్థులతో పంచుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాల్గొన్నారు.

జగన్‌ది నయవంచన : కోండ్రు

రాజాం: సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజలను నయవంచనకు గురి చేశారని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోండ్రు మురళి మోహన్ అన్నారు. మండలంలోని శ్యాంపురం టిడిపి కార్యాలయంలో మండలంలోని దోసరి గ్రామానికి చెందిన 25 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురవాన నారాయణ రావు, వంగా వెంకటరావు, దుప్పల పూడి శ్రీను, నాగళ్ల అప్పల నాయుడు, కరణం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

రామభద్రపురం: ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే చినప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొండకెంగువ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇల్లు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ భూమి మీ హక్కు పథకం ద్వారా ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇళ్ళు మంజూరు చేసి దానిని మహిళల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడమనేది గొప్ప విషయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆకుల సులోచనరాణి, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వేపాడ: మండల విద్యాశాఖాధికారి పి. బాల భాస్కరరావు పెద్దగుడిపాల ప్రాథమిక, బక్కునాయుడుపేట కెజిబివి పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, టెక్స్ బుక్స్, ఇంగ్లీష్ డిక్షనరీ, రాయడం చదవడం ప్రక్రియలను పరిశీలించారు. కెజిబివిలో 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 18వ తేదీ నుండి జరిగే పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని వావిలపాడులో శ్రీకృష్ణ ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచ్ బీల రాజేశ్వరి, సతీష్ దంపతులు, వైసిపి నాయకులు గొగాడ జగన్నాథం నాయుడు, బూడి వెంకటరావు, నాగిరెడ్డి రాజునాయుడు, గొర్లపోటి వెంకటరావు, కోయిలాన శ్రీను, పల్ల గణేష్, రోమాలా తాతం నాయుడు, అబోతు వెంకటేష్, సురేష్, రమేష్ తదితరులు శ్రీకృష్ణుని దర్శించుకున్నారు.

ఎల్లారమ్మ జాతరలో చలివేంద్రాలు

జామి: ఉత్తరాంధ్ర ప్రసిద్ధి గాంచిన ఎల్లారమ్మ జాతరకు విచ్చేసిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోని అప్పారావు ఆర్డిఒ కమిటీ, అధికారులను సూచించారు. ఈ మేరకు ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16,17,18 తేదీల్లో నిర్వహించబోయే ఎల్లారమ్మ జాతరకు లక్షల్లో యాత్రికులు వస్తారని, వారికి సకల వసతులు ఉండేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ తరపున చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొని, సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఎపిటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

నెల్లిమర్ల: ఎపిటిఎఫ్ మండల కార్యవర్గ ఎన్నిక మంగళవారం స్థానిక రామతీర్థం జంక్షన్ ఎంపిపి పాఠశాలలో జరిగింది. ముందుగా నిర్వహించిన ఎపిటిఎఫ్ మండల శాఖ కౌన్సిల్ సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షులు డి.ఈశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వి పైడిరాజు, కె. చిన్నంనాయుడు, ఎం. రామకృష్ణ హాజరయ్యారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా సిహెచ్. ఎర్రి నాయుడు, అధ్యక్షులుగా యు. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కె. బాలకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా వై కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా కె.అప్పారావు, వి శ్రీనివాసరావు, ఆడిషనల్ సెక్రటరీగా పి మోహన్ రావు, సెక్రెటరీలుగా వై. సుజాత, ఎస్. బాబ్జి, ఎస్ సింహాచలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణం చేసింది.

కిడ్నీ బాధితునికి బ్యాటరీ సైకిల్ అందజేత

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పాలవలస గణేష్ స్థానిక ఎస్‌టి కాలనీలో నడవలేని స్థితిలో ఉన్న కిడ్నీ బాధితుడు గొర్లె నారాయణరావుకు బ్యాటరీ సైకిల్ ను మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా గణేష్ మాస్టర్ మాట్లాడుతూ బాధితుడు నారాయణరావు గత కొద్ది ఏళ్లుగా రెండు కిడ్నీలు చెడిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని అన్నారు. నారాయణరావు ఏదైనా వెళ్లడానికి వీలుగా ఉంటుందని భావించి తన సొంత నిధులతో ఈ బ్యాటరీ సైకిల్ కొని అందించడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. మాజీ సర్పంచ్ గొర్లె దేవుడు, గ్రామ యువత సన్యాసిరావు, గణేష్, గురుమూర్తి, సన్యాసపడు మాట్లాడుతూ ఈ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన నొడగల అప్పన్న (67) సోమవారం రాత్రి మృతి చెందాడు. మద్యం ఎందుకు తాగుతున్నావని కొడుకు మందలించడంతో మనస్తాపం చెందిన అప్పన్న ఐదు రోజుల కిందట ఇంటి నుండి వెళ్లిపోయాడు. సోమవారం రాత్రి భోగాపురం పంచాయతీ అప్పన్నపేట వద్ద కుళ్లిపోయిన స్థితిలో అప్పన్న మృతదేహం లభించింది. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - రాజాం

మండలంలోని పెరుమాలి సమీపంలో రాజాం నుండి రామభద్రపురం వైపు వెళ్తున్న ఆటోను వెనక నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో చిన్నపాలవలసకు చెందిన చల్లవరపు తాతబాబు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. వి. చిన్నయ్యపేటకు చెందిన మరో వ్యక్తి గాయపడ్డాడు. ఇతన్ని చికిత్స నిమిత్తం రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఆర్ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆకాంక్షం వ్యక్తం చేశారు. మండలంలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని మంగళవారం ఆయన పంపిణీ చేశారు. గొంప కృష్ణ విద్యా సంకల్పం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే సదుద్దేశంతో 361 మంది పదో తరగతి పరీక్షలకు రానేందుకుగాను ప్యాడ్లు, పెన్నులు, ఇతర స్టేషనరీ మెటీరియల్లను అందజేశారు. గొంప కృష్ణ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తాను మళ్లీ కలుస్తానని అన్నారు. గణితంలో 100 మార్కులు సాధించిన విద్యార్థులకు తమకు నచ్చిన కార్పొరేట్ కళాశాలలో 50శాతం ఫీజు తమ వంతు సహాయం చేయనున్నట్లు తెలిపారు. ఐదు మండలాలల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మండలంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 50శాతం ఫీజు సహాయం చేయనున్నట్లు తెలియజేసారు. విద్యార్థుల భవిష్యత్తుకు టెన్త్ పరీక్షలో కీలకమని ప్రతి ఒక్కరూ కృషి, పట్టుదలతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, మోదిబోయిన మంగరాజు, ఆడారి ఉమామహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.



విద్యార్థులకు మెటీరియల్‌ను అందిస్తున్న గొంప కృష్ణ

కొత్తవలస: మండలంలోని అర్జునపాలెం, వియ్యంపేట, కొత్తవలస, కంటకపల్లి, దెందేరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 584 మంది పదో తరగతి విద్యార్థులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పరీక్ష మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొరపల్లి రాము, బాలకృష్ణ, జగ్గారావు, ఏడువాక రమణ, వల్లపు ఈశ్వరరావు, కంచిపాటి వేణు, తూరిబిల్లి శ్రీరాములు, పల్లి సత్యనారాయణ, బోనీ తిరుపతిరవు, పెంటరావు, సూర్యనారాయణ, కర్రి సూర్య నూకరాజు, గుమ్మడి కోటి, అప్పికొండ శ్రీనివాసరావు, గొరపల్లి అప్పలస్వామి, గంగాధర్, మారడిపుడి చిన్నిలు, వీర్రాజు, రామ్‌కోటి, భూసాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వమే ఆయన మనుగడ

గుర్ల: పోలీస్ వృత్తిలో ఉంటూ తీరిక సమయంలో మానవత్వమే ఆయన మనుగడగా సమాజ శ్రేయస్సు కోసం ఎఎస్ఐ కామేశ్వరరావు చేస్తున్న సేవలు అభినంద నీయమని విజయన గరం వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు సత్యనారాయణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన్ను సత్కరించారు. వారు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అనేక మంది పేద అనాథ వృద్ధులను ఆదుకోవడం, అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు వైద్య సహాయం చేయడం, వికలాంగులకు ఉచితంగా భోజనాలు అందజేసి వారు ఆకలిని తీర్చడం వంటి కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తూ గుడ్డ సంచులను ఉచితంగా పంచడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేసినందుకు ఆయన్ను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎంవి రాజు, ఏ .సూర్య ప్రకాశ రావు, వి.వి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం మూల్యం చెల్లించక తప్పదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించ కపోతే యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి. రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ హెచ్చరించారు. స్థానిక ఆర్ఓబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసన శిబిరం మంగళవారం 41వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరాన్ని సందర్శించిన నాయకులు మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు జనవరి నెల జీతాలు, డిఎ బకాయిలు, వేతన ఒప్పందం చేయాలని నిరసన సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకుండా ప్రభుత్వం, పెద్దల అండతో వీల్లేమి చేస్తారు అని నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కార్మికులు ఓర్పు, సహనంతో ఉన్నారని వారందరికీ ఆకలి మంటలు రగిలితే ఆ మంటల్లో మిమ్స్ యాజమాన్యం మాడి మసై పోతుందని హెచ్చరించారు. 11వ తేదీ నాటికి జనవరి నెల జీతాలు వేస్తారని మిగతా సమస్యలు కూడా పరిష్కరిస్తారని ఎమ్మెల్యే చెప్పినా సరే మిమ్స్ యాజమాన్యం బేఖాతరు చేసిందన్నారు. పని చేసినా కాలానికి మూడు నెలలు గడుస్తున్నా జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం, ప్రజ ప్రతినిధులు స్పందించి మిమ్స్ యాజమాన్యం పై ఒత్తిడి తీసుకు వచ్చి న్యాయమైన సమస్యలు పరిష్కరించి జనవరి నెల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో ఉద్యోగులు ఎం.నారాయణ, గౌరి, మూర్తి, అప్పలనాయుడు, వరలక్ష్మి, బంగారు నాయుడు, ఎం.రాంబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వేపాడ, వల్లంపూడి బల్లంకి, కొంపల్లి, సోంపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె, వెల్‌నెస్ కేంద్రాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభిం చారు. ముందుగా మండలంలో పలు గ్రామాలకు సంబంధించిన 211 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పత్రాల ద్వారా బ్యాంకులో రుణాలు కూడా పొందవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ కస్తూరి, సత్యం, ఎంపిడిఒ నిశ్చల, పిఆర్ జెఇ ఆలీ, ఆయా గ్రామాలకు సంబంధించిన సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి, కాటకాపల్లి, ఉత్తరాపల్లి, వీరభద్రపురంలలోని నూతనంగా నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బికెలు, వెలెనెస్ సెంటర్లను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ముందుగా గ్రామ సందర్శన చేసి గ్రామంలో జరిగిన అభివృద్ధి అడిగి తెలుసుకు న్నారు. అక్కడ ఉన్న మహిళలందరినీ అన్నీ పథకాలు అందుతున్నాయో లేదా అని అడిగి తెలుసుకున్నారు. 2024 ఎన్నికలలో మళ్లి సీఎంగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోడానికి మనం అందరం సిద్దంగా ఉండాలని కొరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కంటకాపల్లి సర్పంచ్ మదిన లక్ష్మి, మదిన అప్పలరాం, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్ అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం మండలంలోని పోతనపల్లి గ్రామంలో క్లస్టర్-3 ఇంచార్జ్ రెడ్డి వెంకన్న, యూనిట్ ఇంచార్జ్ కూనిరెడ్డి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో కోళ్ల లలిత కుమారి పాల్గొని మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను నెలకు రూ.4 వేలకు పెంచుతామని, బిసిలపై దాడులు, దౌర్జన్యాల నుండి రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని సామాజిక న్యాయ పరిశీలన కమిటీ ఏర్పాటు చేసి హక్కులు కాపాడుతామని చెప్పారు. బిసి సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని, స్థానిక సంస్థల్లో బిసి 34 శాతం రిజర్వేషన్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, బీశెట్టి అరుణ, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, యూనిట్ ఇంచార్జ్ కూనిరెడ్డి రాము, మాజీ సర్పంచ్ సత్యం మాస్టర్, గోగాడ అప్పల సత్యం, బోనంగి జ్యోతి, చక్క కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ భరత్, లగుడు తిరుపతి, బండారు సతీష్, గుమ్మడి గణేష్, కాళ్ల నాయుడు, కూనిరెడ్డి ముత్యాల నాయుడు, పైల శ్రీను, బూసరి ఎరనాయుడు, పూడి గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్న వైసిపి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 13 ఏళ్ల క్రితం ఆవిర్భవించి ఎన్నో విజయాలను సొంతం చేసుకుందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వి రాజేష్, నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, పాల్గొన్నారు.

బొబ్బిలి: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసమే వైసిపిని స్థాపించినట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. పట్టణంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మిగారి కోనేరుగట్టుపై ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, ఎంపిపి శంబంగి లక్ష్మి, శంబంగి వేణుగోపాలనాయుడు, పాల్గొన్నారు.

భమిడిపాటికి అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖ జ్యోతిష్యులు, జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు భమిడిపాటి రామ్‌కుమార్ శర్మకు జ్యోతిష శిరోమణి అవార్డు లభించింది. ఈనెల 10న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ ఫౌండర్ డాక్టర్ సి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు జ్యోతిష శిరోమణి అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. మంగళవారం నగరంలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవ సంఘాల సమాఖ్య అధ్యక్షులు టివిశ్రీనివాస్ మాట్లాడారు.

అక్కచెల్లెమ్మలకు చేయూతనివ్వడమే లక్ష్యం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అక్కచెల్ల మ్మలకు చేయూతనివ్వడమే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఎఎంసి కార్యాలయం ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో రూ.36.70కోట్ల చేయూత చెక్కును మహిళలకు అందజేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఎంపిపి మహంతి కల్యాణి, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రమేష్, రామతీర్థం దేవస్థానం మెంబర్ ధాడిశెట్టి త్రినాధరావు, సొసైటీ చైర్మన్ మహంతి లక్ష్మణ రావు, తహశీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపిడిఒ రాధిక, మండల పంచాయితీ విస్తరణ అధికారి శ్రీనివాస రావు, మొంగం నాగబాబు, కొవ్వాడ, కందివలస, పూసపాటిరేగ, చోడమ్మ అగ్రహారం, వెంపాడం సర్పంచులు కోట్ల రఘు, గణేష్, సీతారాం, కొత్తకోట శ్రీరాములు, కుమార్, నాయకులు తాటి శెట్టి సూర్యనారాయణ, బొడ్డు యాల్లాజి, లంకలపల్లి రాజారావు, గుజ్జు సురేష్ రెడ్డి, పడాల శ్రీధర్, మహాలక్ష్మి నాయుడు, రౌతు సాయికుమార్, అప్పన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి - గుర్ల

గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో క్రాష్ ప్రోగ్రామ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఇప్పటికే చాలా గ్రామాలలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. మరమ్మత్తులకు గురైన చేతి బోరులను మరమ్మత్తులు చేసి వాడుకలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైసిపి కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, మధుసూధనరావు, ఎంపిడిఒ వెంకటరమణ, ఆర్ డబ్ల్యూఎస్ జెఇ మురళీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో క్రాష్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన వాహనాన్ని ఎంపిపి డి. సత్యవంతుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్నిఇ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిడిఒ ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు

వంగర: మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు చేపడతామని ట్రెయిని డి.ఎస్.పి మహేంద్ర అన్నారు. ఈ మేరకు మండలంలోని అరసాడ సెంటర్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం పట్ల ఆయన చూసి వారితోపాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించారు. ఎవరైనా మైనర్లు డ్రైవింగ్ చేసినట్లు కనిపిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంగర ఎస్ఐ వైవి జనార్ధన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు

వేపాడ: మండలంలోని పాటూరు కల్లాల వద్ద అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. విజేతలకు కొట్టాడ వెంకటరమణ మూర్తి, అరిగిపాలెం ఎంపిటిసి టివి రమణ, ఆర్‌ఎస్‌పేట మాజీ సర్పంచ్ గొలగాన కృష్ణ, కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందించారు.

సిర్లి రాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని సంగాం గ్రామానికి చెందిన సిర్లి బంగారమ్మ (చిన్నమ్మ) (86) ఇటీవల మృతి చెందడంతో ఆమె కుమారులు సిర్లి రాజు (ఆర్‌ఎంపి), సిర్లి వెంకయ్య కుటుంబాలను దళిత సంఘాల జెఎసి నాయకులు మంగళవారం సంగాం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. బంగారమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు మజ్జి గణపతి, మజ్జి గణపతిరావు, చిత్తిరి గంగులు, డర్రు రాంబాబు (ప్రజాశక్తి విలేకరి), తిర్లంగి సింహాచలం, మండలానికి చెందిన పలువురు దళితులు పాల్గొన్నారు.

గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

ప్రజాశక్తి- గరివిడి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు, కార్యకర్తల సమన్వయంతో సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో-ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బూత్ కన్వీనర్లు, సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని మళ్లీ వైసిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రానున్న 45 రోజులు బూత్ కన్వీనర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు సమన్వయంగా పనిచేసి సీఎం జగన్ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవ సందర్భంగా రూపొందించిన పాటను విడుదల చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు డాక్టర్ బొత్స సందీప్, మీసాల విశ్వేశ్వరరావు, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, జెసిఎస్ ఇంచార్జ్ వలిరెడ్డి శ్రీనివాస్‌నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కోసిన కృష్ణం నాయుడు, పొన్నాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం - మా బూత్ సిద్ధం'

మెరక ముడిదాం: ప్రభుత్వం చేపడుతున్న మేము సిద్ధం -మా బూత్ సిద్ధం కార్యక్రమం మండలంలోని గర్భాం, చెల్లాపురం, బైరిపురం పంచాయతీలో మంగళవారం వైసిపి నాయకులు చేపట్టారు. ఈ సందర్భముగా బైరిపురం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్, తల చుట్ల హరిబాబు, కందుల పార్వతి, బైరిపురం గ్రామ సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ మరి కొద్ది రోజులలో జరగ బోవు ఎన్నికలకు బైరిపురం పంచాయతీ వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మా బూత్ మెంబర్లు అందరూ సిద్ధంగా ఉన్నామన్నారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి జనసేనలో చేరికలు

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడలో వైసిపి నుంచి జనసేనలోకి సోమవారం రాత్రి పలువురు చేరారు. సీనియర్ నాయకులు గదల అచ్చిం నాయుడు తన అనుచరులతో కలిసి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన అభ్యర్థి లోకం మాధవి ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లోకం మాధవి మాట్లాడుతూ కొండవెలగాడ పంచాయతీ మొదటి నుండి వైసిపికి కంచుకోటగా ఉందని ఇలాంటి గ్రామం నుంచి వైసిపికి చెందిన వారు జనసేనలో చేరడం జన సేన ఎన్నికల్లో గెలవడానికి తొలి మెట్టుగా భావిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తల పాల్గొన్నారు

సముద్ర తీరంలో మళ్లీ నల్ల ఇసుక తవ్వకాలు

వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన గ్రామస్తులు

ప్రజాశక్తి - భోగాపురం

నల్ల ఇసుక అమ్మితే లక్షల్లో ఆదాయం వస్తుండడంతో సముద్ర తీరంలో అక్రమార్కులు మళ్లీ నల్ల ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. దీంతో చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ఒక ట్రాక్టరును పట్టుకొని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వీరంతా కోరారు.

దిబ్బలపాలెం సమీపంలో గతంలో విచ్చలవిడిగా నల్ల ఇసుకను తీసి లారీల్లో తరలించే వారు. అప్పట్లో లారీలు పట్టుబడినప్పటికి సరైన విచారణ చేయకుండా కేవలం డ్రైవరుపైనే కేసు నమోదు చేసి పోలీసులు వదిలేశారు. దీంతో సుమారు మూడు నెలలుగా నిలిచినప్పటికీ మళ్లీ అక్రమార్కులు ఇసుక అక్రమ రవాణాను మొదలుపెట్టారు. చేపల కంచేరు, దిబ్బలపాలెం గ్రామానికి చెందిన వారే ఈ అక్రమ రవాణా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ట్రాక్టర్లను అర్ధరాత్రి వేళ తీసుకువెళ్లి జెసిబిలు, కూలీల సాయంతో ఈ ఇసుకను లోడు చేస్తున్నారు. అనంతరం ఈ ఇసుకను ఒడ్డుకు తీసుకువచ్చి తుప్పల్లో అన్‌లోడ్ చేస్తున్నారు. రాత్రివేళ లారీల్లో లోడు చేసి ఒరిస్సా, హైదరాబాదు, ఉత్తరప్రదేశ్ తరలిస్తున్నారు.

యువకులకు పట్టుబడిన ట్రాక్టర్

అర్ధరాత్రి వేళ ఇసుకను ట్రాక్టరుకు లోడు చేసి తరలిస్తుండగా సమీపంలోని కొంతమంది యువకులు పట్టుకొని వీడియో తీసి వదిలేశారు. తరువాత ఆ వీడియోను, నిల్వ చేసిన ఇసుక ఫోటోతో సహా సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఇసుక అక్రమార్కులను పట్టుకోవాలంటూ ఒక ఆడియో పెట్టారు. దీంతో ఈ ఇసుక అక్రమ రవాణా వ్యవహారం మళ్లీ వెలుగులోకి వచ్చింది.

ఇసుక అక్రమరవాణా చేస్తే కఠిన చర్యలు

సముద్రం ఒడ్డున ఉన్న నల్ల ఇసుకను ఎవరైనా తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వీడియోను పరిశీలించి ఎవరైతే ఈ అక్రమాలకు పాల్పడుతున్నారో వారిని గుర్తించి కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నిస్తాం.

- ఎ.రవికుమార్, సిఐ, భోగాపురం